ప్రజాశక్తి

శుక్రవారం 5 డిసెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

దాడులు సరే.. చర్యలేవీ ?



జగదాంబ దరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు (ఫైల్)

- ఎసిబి తీరుపై సర్వత్రా విమర్శలు
- అధికారుల తనిఖీలనంతరం పైరవీల్లో సబ్ రిజిస్ట్రార్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా సహా రాష్ట్రమంతటా ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు జరిగినప్పటికీ అనంతరం తగు చర్యలు తీసుకోవడంలో జాప్యం జరగడంతో సబ్‌రిజిస్ట్రార్లు లాబీయింగ్‌కు పాల్పడు తున్నట్లు ప్రచారం సాగుతోంది. విశాఖలోని వన్ టౌన్, మధురవాడల్లో కొద్ది రోజుల క్రితం ఎసిబి అధికారులు వరుస దాడులు చేపట్టారు. పలు రికార్డులను స్వాధీన పరుచుకున్నారు. ఈ క్రమంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు, భూ లావాదేవీల్లో భారీగా అవినీతి జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల అనధికారిక నగదును కూడా ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్నట్లు భోగట్టా. తనిఖీలతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు, పలు రిజిస్ట్రార్ కార్యా లయాల్లో భారీగా అవినీతి జరిగినట్లు గుర్తించారు. అక్రమ రికార్డులు పలుచోట్ల బయటపడ్డాయి.

సర్దుకుంటున్న సబ్‌రిజిస్ట్రార్లు

ఎసిబి దాడుల పిదప తాజాగా సబ్‌రిజిస్ట్రార్‌లంతా స్థానాలు మారకుండా చూసుకుంటున్నట్లు భోగట్టా. ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరుతున్న అవినీతికి ఇదో తాజా తార్కాణం. రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల కాలంలో రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, పోలీసు శాఖల్లో అవినీతి, అక్రమ వ్యవహారాలు సహా ప్రజలపై పెనాల్టీలు వంటివి పెట్రేగి పోయాయి. స్థానికంగా ఎంఎల్‌ఎలకు సబ్‌రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదులున్నప్పటికీ వారి జోలికి వెళ్లడం లేదు. తాజాగా జరిగిన ఎసిబి దాడులతో అధికారులే మంత్రుల పేషీ, ఇతర ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్‌కు పాల్పడుతున్నట్లు స్పష్ట మవుతోంది. ఇటీవల ఎసిబి దాడులనంతరం విశాఖ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను అనకాపల్లి జిల్లాలోని పలు ఎస్ఆర్ కార్యాలయాలకు బదిలీ చేసినప్పటికీ ఆ స్థానాలకు వెళ్లి ఆ పోస్టింగుల్లో చేరేందుకు ఎవరూ అడుగులు వేయడం లేదు. పలువురు సబ్‌రిజిస్ట్రార్‌లు చేతివాటం ప్రదర్శిస్తూ పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు.

విశాఖపట్నం డిఐజి ఏమన్నారంటే...

ఎసిబి దాడుల తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తాజాగా ఏం జరుగుతోంది ? చర్యలేమైనా ఎవరిపైనైనా తీసుకున్నారా ? అని 'ప్రజాశక్తి' విశాఖపట్నం రిజిస్ట్రేషన్స్ డిఐజి బాలకృష్ణను వివరణ కోరగా ప్రభుత్వమే ఈ వ్యవహారాన్ని చూస్తోందన్నారు. తాను కొంత సమాచారాన్ని ఎస్ఆర్‌లకు సంబంధించి ఇచ్చానన్నారు. ఉన్నతాధికారులే దీనిపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఒకటి, రెండు రోజుల్లో బదిలీలపై స్పష్టత వచ్చే అవకాశముందన్నారు.

విశాఖకు భారత్ - దక్షిణాఫ్రికా జట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సిరీస్‌లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం జరగనున్న నిర్ణయాత్మక మూడో వన్డే మ్యాచ్ కోసం ఇరు జట్లు గురువారం సాయంత్రం రాయపూర్ నుంచి విశాఖపట్నం చేరుకున్నాయి. రాయపూర్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం సాధించడంతో మూడు వన్డేల సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది. ఈ నేపథ్యంలో సిరీస్ విజేతను నిర్ణయించే ఈ చివరి మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. జట్ల రాకతో వైజాగ్ నగరంలో క్రికెట్ ఫీవర్ మొదలైంది. ఇరు జట్లు శుక్రవారం నగరంలోని ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్లలో పాల్గొననున్నాయి. 6న జరిగే కీలక పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు ఉవ్విళ్లూ రుతున్నారు. విశాఖ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలించేది కావడంతో మరో హై స్కోరింగ్ మ్యాచ్‌ను ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



నగరానికి చేరుకున్న రోహిత్ శర్మ

6న రాష్ట్ర గవర్నర్ రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 6, 7 తేదీలలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విశాఖలో పర్యటించనున్నారు. ఈ నెల 6న ఉదయం 8 గంటలకు వాయు మార్గం ద్వారా ఆయన విశాఖ చేరుకుంటారు. అక్కడ నుండి నోవాటెల్‌కు వెళ్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధురవాడలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియానికి చేరుకుంటారు. రాత్రి 10 గంటలకు స్టేడియం నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు. 7న మధ్యాహ్నం 1.45 గంటలకు ఎయిర్ పోర్టుకు చేరుకుని వాయు మార్గం ద్వారా విజయవాడ వెళ్తారు.

నేటి నుంచి ఎన్నికల సంఘం సిఇఒ పర్యటన

▶ వార్త 2లో..

ముగిసిన లోకో పైలట్ల 48 గంటల దీక్ష

▶ వార్త 2లో..

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

▶ వార్త 5లో..



నివాళి అర్పిస్తున్న నేవీ అధికారులు, విశాఖ కలెక్టర్, సిపి తదితరులు

విక్టరీ ఎట్ సీ వద్ద అమరులకు నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నావికా దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం విశాఖపట్నం బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' స్మారకం వద్ద అమరవీరులకు నావికులు ఘనంగా నివాళ్లర్పించారు. తూర్పు నావికా దళ విభాగాధిపతి (ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, తూర్పు నావల్ కమాండ్) వైస్ అడ్మిరల్ సంజయ్ బల్లా, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, నేవీ, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు తొలి ప్రాధాన్యం

రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహిళా భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా నేరస్తుల్లో భయం పెరిగిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ నగరం దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరంగా 'నారీ రిపోర్ట్ 2025' ద్వారా జాతీయ స్థాయిలో ఇటీవల గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ, సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు.

ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ గత మూడు నెలల్లో అనేక కేసుల్లో నిందితులకు 25 ఏళ్ల వరకు శిక్షలు పడ్డాయని తెలిపారు. సిపి శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ విశాఖ నగర పోలీసులు 24/7 చేసిన కృషి, శక్తి టీమ్స్, శక్తి యాప్ పనితీరు, క్రైమ్ జోన్‌లలో డ్రోన్ల వినియోగం వంటి చర్యల ఫలితంగా ఈ గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఆన్‌లైన్ వేధింపులకు గురైన మహిళలు భయపడకుండా, డబ్బులు ఇవ్వకుండా వెంటనే దగ్గరి పోలీస్ స్టేషన్‌కు లేదా నేరుగా సిపి మొబైల్ నంబర్ 7995095799కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.



ర్యాలీలో పాల్గొన్న హోం మంత్రి అనిత

క్రికెటర్ కరుణ కుమారికి ఘన సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవంబర్‌లో భారత్ వేదికగా జరిగిన భారత జట్టు అంధుల మహిళా టి-20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణ కుమారిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఘనంగా సత్కరించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులు, అంధ పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు గురువారం సాయంత్రం కరుణ కుమారిని జిల్లా పరిషత్తు జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు ఊరేగింపుగా తీసుకురాగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలంకరణతో ఘనంగా సత్కరించారు. ప్రపంచకప్‌కు సెలెక్ట్ అయిన తరువాత ప్రాక్టీస్‌కు అనుగుణంగా కరుణకుమారికి ప్రత్యేకంగా రెండు క్రికెట్ కిట్లు కోసం రూ.50 వేలు అందించారు. భారత జట్టు విజయంలో కీలక ప్రతిభ చూపినందుకు ప్రోత్సాహకంగా జిల్లా కలెక్టర్ రూ. లక్ష చెక్‌ను అందజేశారు. క్రికెట్ ఫర్ ది బ్లైండ్ ప్రెసిడెంట్ శరత్ కరుణ కుమారిని అభినందిస్తూ రూ.లక్ష చెక్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కవిత, క్రికెట్ ఫర్ ది బ్లైండ్ ప్రెసిడెంట్ శరత్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నుంచి శీతల్, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాలలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాలు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద కేసులు, బ్యాంకు, మనీ రికవరీ, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు మినహా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 0891-2560414, 2575046 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అదనపు పిపిగా పార్థసారథి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కం ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కర్రి పార్థసారథిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లా డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతల్లో ఆయన మూడేళ్ళ విధులు నిర్వర్తించనున్నారు. ఈ క్రమంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన పార్థసారథికి టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర నాయకులు మానం శోభనబాబు, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళలకు హక్కులు, చట్టాలు, రక్షణపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ద్వారకా నగర్ నాలుగో లైన్‌లో ఉన్న బా బాపు భవన్‌లో గురువారం సాయంత్రం మహిళల హక్కులపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

నేటి నుంచి ఎన్నికల సంఘం సిఇఒ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం సిఇఒ వివేక్ యాదవ్ శుక్ర, శని, ఆదివారాలలో విశాఖపట్నం, ఎఎస్ఆర్ జిల్లాలలో పర్యటిస్తారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. ఆయన శుక్రవారం రాత్రి వాయు మార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు. శనివారం ఉదయం విశాఖపట్నం కలెక్టరేట్‌లోని ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై ఇఆర్ఒ, ఎఇఆర్ఒలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించి పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తారు. ఆదివారం విజయవాడ వెళ్తారు.

చిరస్మరణీయ న్యాయవాది హరనాథ్



హరనాథ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేద ప్రజలు, సమాజం కోసం పనిచేసిన న్యాయవాది నాగిరెడ్డి హరనాథ్ అని పలువురు వక్తలు కొనియాడారు. న్యాయవాది, ఐలు నాయకుడు హరనాథ్ సంస్మరణ సభ గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఐలు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు అల్లు సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. సంఘం గౌరవాధ్యక్షులు బి.వి.రామాంజనేయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల వెంకటేశ్వరరావు, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్.కె.శ్రీనివాస్, ఎల్‌పి.నాయుడు, అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు వివిఎస్.పద్మనాభరాజు, మావయ్య ఆర్.లక్ష్మణరావు, అశ్వనీకుమార్, మూర్తి, పూర్ణిమ తదితరులు మాట్లాడారు. పేద ప్రజలు, ఉద్యమకారుల తరుపున పనిచేసిన న్యాయవాది హరనాథ్ అని గుర్తుచేసుకున్నారు. వివాదాల విషయంలో ఇరు గ్రూపులను ఒప్పించి రాజీమార్గంలో పరిష్కరించడంలో దిట్ట అని కొనియాడారు. ఆయన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఐలు జిల్లా కార్యదర్శి శ్రీధర్ వందన సమర్పణ చేశారు. సభలో జిల్లా నాయకులు చిట్టిబాబు, ఆనందరెడ్డి, మణి, భవాని, సంతోషి, మృదుల, ఫాతిమా, పాపారావు, పార్వతీశ్వరరావు, గణపతి, కుమార్, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ముగిసిన లోకో పైలట్ల 48 గంటల దీక్ష



దీక్షలో కూర్చున్న లోకో పైలట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దీర్ఘకాల పని పూటలు నిలిపివేయాలని, కాలానుగుణ విశ్రాంతి, కనీస మైలేజీ కల్పించాలని డిమాండ్ చేస్తూ దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం వద్ద ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షా కార్యక్రమం గురువారంతో ముగిసింది. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ డిసెంబర్ 21 నుండి నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు పూనుకుందని, ఇది కార్మిక వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించకపోవడం, ఖాళీలను భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. లోకో పైలట్ల దీక్షకు ఆలిండియా స్టేషన్ మాస్టర్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి ఫాణి కుమార్, గార్డ్ కౌన్సిల్ డివిజనల్ కార్యదర్శి వర్మ, ఈస్ట్ కోస్ట్ రైల్వే యూనియన్ జనరల్ సెక్రటరీ ఆర్‌సి.సాహూ, జోనల్ ప్రెసిడెంట్ సంపత్ సంఘీభావం ప్రకటించారు. ఎఐఎల్ఆర్ఎస్ఎ జోనల్ ప్రెసిడెంట్ ఎస్‌కె చౌబే, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వివిఎస్‌బి.రాజు, హరికృష్ణ, ఎం.చిన్నోడు పాల్గొన్నారు.

పోలీస్ ఆరోగ్య బీమా పథకం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా అత్యధిక కవరేజ్ అందించే బృహత్తర పథకం విశాఖపట్నం నగరంలో గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో ఈ పోలీస్ ఆరోగ్య బీమా పథకం, 24/7 హెల్ప్ అసిస్టెన్స్ సెంటర్‌ను సిపి లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథి అనిత మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఆరోగ్య, భద్రతా సమస్యలను తాను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య భద్రత కవరేజ్ చాలడం లేదని, చిన్న వ్యాధులకు కూడా అధిక ఖర్చుల వల్ల అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ చేసే సేవలు అత్యంత బాధ్యతాయుతమైనవని కొనియాడారు.

విద్యార్థుల సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాంగ్రెస్ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యాన ఎఐసిసి జాతీయ అధికార ప్రతినిధి సునీల్ అహిరా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం పర్యటించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. రీడింగ్ రూమ్‌లో విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయట్లేదని, ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నామని పలువురు చెప్పుకొచ్చారు.

ఇంజనీరింగ్ విభాగంపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జివిఎంసి ఇంజినీరింగ్ విభాగంపై అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీరు సత్యనారాయణ రాజు, పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

సమతుల్య ఆహారంపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విశాఖ అకాడమీ ఆఫ్ ఫిజియో మెడికల్ సైన్సెస్ కళాశాల వైద్య సిబ్బంది, ట్రైనీ డాక్టర్లు 60 మంది సందర్శించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. చేతులు సరిగ్గా శుభ్రపరచుకునే విధానం, బ్రష్ చేయు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యంపై చూపే ప్రభావం వంటి అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. విద్యార్థులకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించిన వైద్య సిబ్బందికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యువివి.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష రెడ్డి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామతులసి, ఫిజియోథెరపీ విద్యార్థులు, ఉపాధ్యాయులు లలితాదేవి, శివగంగా వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న సత్యవరప్రసాద్

నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవరప్రసాద్ ప్రమాణం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సురాల సత్య వరప్రసాద్ నాగ వంశ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడ గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సురాల సత్య వరప్రసాదరావు మాట్లాడుత, తనకు ఈ అవకాశం కల్పించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

'అవంతి'లో డిజైన్ థింకింగ్‌పై సెమినార్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ, మెకానికల్ విద్యార్థులకు డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజైన్ థింకింగ్‌పై ప్రొఫెసర్ సుహాస్ దాండే, ముంబయిలోని ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఎల్ఎన్.వాలింగకర్ అవగాహన కల్పించారు. ఫ్యూచర్ ఇన్నోవేటర్స్‌గా మారాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ యు.రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

60 అడుగులకు విస్తరించండి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి రోడ్డును 60 అడుగులకు విస్తరిస్తే సరిపోతుందని బాధితులు చెప్పారు. గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో బాధితుల సంఘం ప్రెసిడెంట్ అల్లుగోలు శ్రీను మాట్లాడుతూ, 60 అడుగులకు మార్కింగ్ చేసి అప్పగిస్తే సొంత డబ్బులతో విస్తరణ చేసుకుంటామని, తమకు ఎలాంటి నష్ట పరిహారం అవసరంలేదని చెప్పారు. ఐదు కిలోమీటర్ల రోడ్డులో అరకిలోమీటరు మేరకు మాత్రమే ఇరుకు సమస్య ఉందని, మిగతా వెడల్పుగా ఉందని తెలిపారు. అభివృద్ధికి తాము వ్యతిరేకులం కాదని, 60 అడుగులు వెడల్పునకు అధికారులు పరిశీలించాలని కోరారు. గ్రామపెద్ద రంగురి సీతారామాదొర మాట్లాడుతూ, ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. అభివృద్ధి పేరుతో అందరినీ రోడ్డు మీదకు తీసుకురావడం తగదన్నారు. దీనిపై డిప్యూటీ టౌన్ ప్లానర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం సంబంధించి 150 రోడ్ల మాస్టర్ ప్లాన్ ప్రకారం వెడల్పు తప్పనిసరిగా గుర్తించారని, అందులో భీమిలి తగరపువలస రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 అడుగులకు విస్తరణ చేయవలసి ఉండగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు 80 అడుగులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. స్థానికులు చెబుతున్న 60 అడుగుల ప్రతిపాదనను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. 80 అడుగుల విస్తరణ వల్ల 626 భవనాలకు నష్టం జరుగుతుందని, అందులో 400 ప్రభుత్వ భవనాలు ఉన్నాయని వివరించారు. భవనానికి నష్ట పరిహారం చెల్లిస్తామని, స్థలాలకు టిడిఆర్‌లు ఇస్తామని చెప్పారు. సర్వం కోల్పోయిన వారికి మరోచోట దుకాణాల కేటాయింపు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, భీమిలి ఎసిపి రామకృష్ణ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

450 కుటుంబాలను 'గీతం' దత్తత

ప్రజాశక్తి-మధురవాడ : వైద్య విద్యార్థులకు ప్రజారోగ్యం పట్ల బాధ్యత, అవగాహనను పెంచడానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసి) ఆదేశాల మేరకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య కళాశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన ఎంబిబిఎస్ -2025 బ్యాచ్ కోసం ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. స్థానిక రుషికొండ గ్రామంలోని 450 కుటుంబాలను 150 మంది వైద్య విద్యార్థులు దత్తతకు స్వీకరించారు. మూడు సంవత్సరాల పాటు ఆయా కుటుంబాల ఆరోగ్య పరిస్థితులను గీతం వైద్య విద్యార్థులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిమ్సర్ సామాజిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీవిద్య మాట్లాడుతూ, ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యం వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్యంపై సమాజపు అంశాలు ఎలా ప్రభావితం చేస్తాయో భవిష్యత్ వైద్యులకు అవగాహన కల్పించడమేనని చెప్పారు. కుటుంబాలతో క్రియాశీలకంగా సంభాషణ జరపడం ద్వారా విద్యార్థులు కమ్యూనిటీ ఆరోగ్య అవసరాలపై విలువైన అవగాహన పొందుతారని, ఇది వారి క్లినికల్ శిక్షణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. మూడేళ్ల కాలం ముగిసే సమయానికి విద్యార్థులు తమకు కేటాయించిన కుటుంబాల ఆరోగ్య పురోగతిపై ఒక సమగ్ర నివేదిక సమర్పిస్తారని తెలిపారు.



దత్తత కుటుంబాలకు కార్డులు అందజేస్తున్న గీతం ప్రతినిధులు

జిమ్సర్ ఆపరేషన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.కార్తీక్ మాట్లాడుతూ, దత్తత తీసుకున్న కుటుంబాల ఆరోగ్య పరీక్షలు, ఔషధాలు సహ వైద్య ఛార్జీలపై 50 శాతం రాయితీను ఇప్పటికే అందుబాటులో ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా అందిస్తామన్నారు. రుషికొండలోని స్వర్ణభారతినగర్ సామాజిక భవనంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రుషికొండ గ్రామ పెద్ద చెన్నాదాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి డెమ్‌కాన్ సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : డిమెన్షియా వ్యాధి నివారణ, చికిత్స, అవగాహన కోసం పనిచేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ డిమెన్షియా ఇండియా అలయన్స్, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ఆసుపత్రి, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, నిమ్ హేన్స్-సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్, ప్రభుత్వ మానసిక ఆరోగ్య సంస్థ సంయుక్తంగా ఈ నెల 5, 6 తేదీలలో డెమ్‌కాన్-2025 పేరిట సమావేశాలను నిర్వహిస్తున్నాయని సమావేశాల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్.రాజు తెలిపారు. రెండు రోజుల పాటు గీతం వైద్య కళాశాల వేదికగా జరిగే ఈ జాతీయ సమావేశాలకు దేశంలోని వైద్యులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, విద్యార్థులు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, సంరక్షకులు, వృద్ధుల సంరక్షణ సంస్థలతో సహ దాదాపు 800 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా విశాఖపట్నం కలెక్టర్ ఎమ్ఎన్. హరేంధిరప్రసాద్, గౌరవ అతిథులుగా రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నీలిమా సురపనేని, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజిందర్ కె.ధమిజా హాజరుకానున్నారని పేర్కొన్నారు. డెమ్‌కాన్-25 భాగంగా, జిల్లాలలో డిమెన్షియా సంరక్షణను బలోపేతం చేయడానికి, ముందస్తు గుర్తింపు కోసం సామర్థ్యాన్ని పెంపొందించడానికి రిఫరల్, కమ్యూనిటీ స్థాయి మద్దతు కోసం ప్రభుత్వ వైద్యులకు ప్రత్యేక శిక్షణా సెషన్లు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు.

పెదగదిలి, తోటగురువులో వెలగపూడి పర్యటన

ప్రజాశక్తి - ఆరిలోవ : పెదగదిలి, తోటగరువు ప్రాంతాలలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారంపర్యటించారు. పెదగదిలి నుంచి తోటగురువు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న రైతు బజార్, కల్యాణమండపం, హైస్కూల్, దేవాలయాలు, అంతర్జాతీయ షటిల్ అకాడమీ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ నేపథ్యంలో పరిశీలించారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం, చీకటి పడితే తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడాన్ని దృష్టిలో పెట్టుకొని 80 అడుగులు రోడ్డుగా విస్తరించి రెండు లైన్లు ఏర్పాటు చేసి, సెంటర్ లైటింగ్, మధ్య డివైడర్‌లో అందమైన చెట్లు, పాదచారులకు ఫుట్ పాత్‌తో వెంటనే పనులు ప్రారంభించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ వెంకటరావు, ఎలక్ట్రికల్ డిఇ అన్నంనాయుడు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, సాయిరాం కేటరింగ్ అధినేత కాకి గంగరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, మద్దిల రాజేష్ పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

నేరాలు ఘోరాలు

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక శ్రీనగర్ బ్రిడ్జ్ వద్ద భారీ లారీ అదుపుతప్పింది. లారీ జారిపడి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం క్రేన్‌ను ఏర్పాటుచేసి లారీని సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో అక్రమంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. సిటిఎఫ్ భాస్కరరావుకు అందిన సమాచారం మేరకు, ఆనందపురం ఎస్ఐ పి.శివ, పోలీసులు, సిటిఎఫ్ సిబ్బంది కలిసి మామిడిలోవ గ్రామంలో జరిపిన సోదాలో జి.నాగరాజు (42) బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. 180 ఎం ఎల్ సామర్థ్యంలోని 95 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గండిగుండంలో నిర్వహించిన దాడిలో కె.గంగరాజు (42) మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి 180 ఎమ్ఎల్ పరిమాణంలో 211 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపైనా కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించామని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ జి.సంతోష్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ప్రజాశక్తి- లీగల్ : లారీని నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.ప్రవీణ్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించేలా చూడాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి... మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ రామకృష్ణ శుక్లా (26) 2022 ఫిబ్రవరి 7వ తేదిన లారీని అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ఓల్డ్ డెయిరీ ఫార్మ్ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దినసరి కూలి పనులు పూర్తి చేసుకొని భీమునిపట్నం నుండి బైక్‌పై వస్తున్న ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై మృతుల్లో ఒకరి భార్య కనకాల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పట్లో ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడి నేరాన్ని సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ నిరూపించడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

మోసం కేసులో తండ్రి, కొడుకు అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని కె.రమ్య రాజు అనే మహిళను మభ్యపెట్టి రూ.కోటి 97 లక్షలను కాజేశారనే అభియోగంపై రిటైర్డ్ రైల్వే టిటిఇ సదరం శివ, ప్రేమ్ సాగర్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారిరువురూ తండ్రీ కొడుకులు. ఈ కేసు వివరాలను వన్ టౌన్ పోలీసులు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పెట్టుబడి పెట్టిన రూ. కోటీ 97 లక్షలు వెనక్కి రాకపోవడంతో రమ్యరాజు సదరం ప్రేమ్ సాగర్‌ను అడిగింది. ఇంకొంత డబ్బులు పెట్టుబడి పెడితే ఆ డబ్బులు వెనక్కి వస్తాయని ఆమెను అతడు నమ్మించాడు. తన దగ్గర డబ్బులు లేవని ఆమె చెప్పగా ఇంట్లో బంగారం ఉంటే తీసుకురమ్మని చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ఆమె పెద్ద మొత్తంలో బంగారాన్ని ఆనంద్ అనే వ్యక్తి ద్వారా తాకట్టు పెట్టింది. ఆ డబ్బులనూ ప్రేమ్ సాగర్ కాజేశాడు. ఆమె పలుమార్లు డబ్బుల కోసం అడగగా బ్లాక్ మెయిల్ చేస్తూ వేధించసాగాడు. దీంతో ఆమె వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. వారు నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సన్యాసిరాజు సంస్మరణ సభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రముఖ గాయకులు, రచయిత అడిదం సన్యాసిరాజు సంస్మరణ సభ గురువారం భీమిలిలో నిర్వహించారు. వెల్చేరు కళా వేదిక, ఫ్రెండ్స్ అసోసియేషన్, ఎస్ఆర్ ఈవెంట్స్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, సన్యాసిరాజు సేవలను కొనియాడారు. ప్రముఖులు గాడు తాతినాయుడు, జి.సత్యనారాయణ, గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఆకతాయిలతో అవస్థలు

బిలాల్‌కాలనీలో మందు బాబుల ఆగడాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : గంజాయి, మద్యం తాగి ఆకతాయిలు సృష్టిస్తున్న బీభత్సానికి జివిఎంసి 14వ వార్డు పరిధి బిలాల్‌కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొండ ప్రాంతం కావడంతో రాత్రిపూట ఆకతాయిలు అక్కడికి వచ్చి గంజాయి, మద్యం తాగి అల్లర్లు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి తెల్లవారుజాము వరకు గంజాయి మత్తులో ఉండి వీరంగం సృష్టిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఎవరైనా ప్రశ్నిస్తే తిరగబడుతున్నారని వాపోతున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా వచ్చి వెళ్తున్నారు తప్ప ఆకతాయిలను అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారని చెబుతున్నారు. దీనిపై పలుమార్లు స్థానిక కార్పొరేటర్‌కు, ఎమ్మెల్యేకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావును వివరణ కోరగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని, గంజాయి, మద్యం తాగి అల్లర్లు సృష్టిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.


మందుబాబులు వదిలి పెట్టిన వ్యర్థాలు (ఇన్‌సెట్‌లో నిర్మానుష్య కొండ ప్రాంతం)


కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా కెల్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు టిడిపి నాయకులు కెల్ల సత్యనారాయణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆరిలోవకాలనీలోని జివిఎంసి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జన్మదిన కేక్ కట్ చేసి సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, సీనియర్ నాయకులు పొత్రకండ ధర్మారావు, ఎల్లమల్లి సురేష్, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు, 62వ కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ, టిడిపి వార్డు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు ముగడ రాజారావు, కేటరింగ్ రాజు, గాడి సత్యం, మద్దిల రాజేష్, పిఐ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


సంతకాల సేకరిస్తున్న సిరి సహస్ర, కార్పొరేటర్ ఏడుకొండల రావు

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ 4వ వార్డు వైసిపి కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆధ్వర్యంలో గురువారం మంగమారిపేటలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్య, వైద్యం సామాన్యులకు అందనీయకుండా వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల రమణ, ఎరుసు అప్పలకొండ, తోట వాసు తదితరులు పాల్గొన్నారు


పతకాలు సాధించిన పూజిత, శతుశేఖర

రోలర్ బాస్కెట్ బాల్ పోటీల్లో అన్నాచెల్లెలు ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ జిల్లా రోలర్ బాస్కెట్ బాల్ పోటీల్లో మధురవాడకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ -14 కేటగిరిలో కనకల శతుశేఖర్ వెండి పతకం, అండర్ 11 కేటగిరీలో కనకల పూజిత బంగారు పతకాలు సాధించారు. అన్నాచెల్లెలు. వీరు మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పిల్లల విజయం పట్ల తండ్రి కెవి.నరసింహమూర్తి ఆనందం వ్యక్తంచేశారు. నరసింహమూర్తి పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులిద్దరికీ సిఐ జి.బాలకృష్ణతో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సిగ్గుచేటు

ఎఐసిసి అబ్జర్వర్ సునీల్ అహిర్


సునీల్ అహిర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికి యత్నించడం సిగ్గుచేటని ఎఐసిసి అబ్జర్వర్ సునీల్ అహిర్ పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని తెలుసుకోవడానికి సునీల్ అహిర్ గురువారం ఉక్కు నగరంలోని ఎఐటియుసి కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఎఐటియుసి, సిఐటియు నాయకులు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు పన్నాగాలు పన్నడం ఆందోళనకరమన్నారు. ఎంతో ఉత్పాదకత కలిగిన సంస్థను కావాలనే నిర్వీర్యం చేసి, పూర్తిగా అంతమొందించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్థాపించిన ఈ స్టీల్‌ప్లాంట్ మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే పునర్జీవం పొందుతుందని చెప్పారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లించడం అన్యాయమన్నారు. ఈ విషయాలన్నింటినీ పార్టీ అధిష్టానానికి, రాహుల్ గాంధీకి నివేదించి, ఆయన స్వయంగా జోక్యం చేసుకునేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిసిసి నాయకులు జహబేగ్, ఎఐటియుసి నాయకులు ఆదినారాయణ, సిఐటియు నాయకుడు అయోధ్యరాం, కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, గవర వెంకటరమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెడుతుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చెప్పారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపులు లేవన్నారు. పేర్ని నాని ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు.

జివిఎంసి జోన్-2 ఇన్‌ఛార్జిగా అయ్యప్పనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్-2 ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్‌గా ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం భీమిలి జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు జోన్-2 ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ విధులు నిర్వహించిన కనకమహాలక్ష్మి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

ప్రజాశక్తి -మధురవాడ : కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని జివిఎంసి 8వ వార్డు టిడిపి అధ్యక్షులు చెట్టుపల్లి సన్యాసిరావు చెప్పారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజను గురువారం నగరంలోని ఆయన నివాసంలో సన్యాసిరావు కలిశారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

తల్లిదండ్రుల సమావేశానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశానికి ముస్తాబు చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోనూ, గదుల్లోనూ శుభ్రం చేసి మామిడి తోరణాలు అలంకరిస్తున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ఉపాధ్యక్షులు కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆయా విభాగాల కార్మికులు గురువారం సిహెచ్‌సి ఆవరణలో పలు డిమాండ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఎ.శంకరరావు, కార్మికులు ఆకుల భవానీ, రామలక్ష్మి, ఎన్.లక్ష్మి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి గవరవీధికి చెందిన కాండ్రేగుల శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కార్పొరేటర్ బొండా జగన్నాథం గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా సిఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కాండ్రేగుల శ్రీనివాసరావుకు రూ.41,048 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు, ప్రగడ దానయ్య, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, ఆనంద్ కుమార్, కడుపుట్ల శ్రీను, గండేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వం విప్ గణబాబు పంపిణీ చేశారు. చుక్కా నూకరత్నం (రూ.1,18,881), ప్రసంగి మాణిక్యం (రూ. 86359), బేబీ ఆఫ్ మంగళగిరి నూకరత్నం (రూ.49,267), బేబీ ఆఫ్ మహ్మద్ రుసోను (రూ.1,77,867), కండల శ్రీదేవి (రూ.92,084), మార్ని శివ వెంకట సత్యనారాయణలకు (రూ.40 వేలు) అందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం పార్టీలకతీతంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేస్తున్న గణబాబు

సంజయ్ సింగ్‌కు స్వాగతం


సంజయ్ సింగ్‌కు స్వాగతం పలికిన ఐఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి- ములగాడ : విశాఖపట్నంలో మూడు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఐఎన్‌టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్‌కు ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యంగా మంత్రి రాజశేఖర్, భోగవిల్లి నాగభూషణం, నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ ప్లాంటు, బీహెచ్‌పివి, ఎన్ఎడి, నేవల్ డాక్‌యార్డ్, హెచ్‌పిసిఎల్, షిప్ యార్డ్ తదితర సంస్థల ఐఎన్‌టియుసి నాయకులందరూ వచ్చి స్వాగతం పలికారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభ సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద గురువారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యారంగ సమస్యల కోసం విద్యార్థుల కోసం పోరాడుతుందని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రూ.6400 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, శిథిల భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ప్రాంతంలో ఉన్న డిగ్రీ కాలేజీకి సొంత భవనం కేటాయించాలని కోరారు. అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు సొంతభవనాలు కేటాయించాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు మూడు వేల రూపాయలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, కార్యదర్శి పి విజయ్, ఉపాధ్యక్షులు గౌతం, గర్ల్స్ కన్వీనర్ పి వెంకట కుమారి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

ఖాతాదారులందరికీ జీవిత బీమా

ప్రజాశక్తి-దేవరాపల్లి : తమ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరకీ జీవిత బీమా పథకం వర్తింపజేస్తామని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎం.అలమండ బ్రాంచి మేనేజరు రవి కిరణ్ పేర్కొన్నారు. ఏడాదికి పీఎం ఎస్బీవై పథకం కింద కేవలం రూ.20 చెల్లించినా, పీఎంజెజెబీవై పథకం కింద ఏడాదికి రూ.436లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇలా చెల్లించిన వ్యక్తి సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు బీమా నగదు వారి కుటుంబానికి అందజేస్తామన్నారు. రూపేయ్, ఏటీఎం కార్డు వినియోగించే బ్యాంకు ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వస్తుందన్నారు. మండలంలోని ముషిడిపల్లికి చెందిన గురే రాము అనే బ్యాంకు ఖాతాదారురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు బీమా పథకం వర్తించడంతో రూ.2 లక్షల భీమా చెక్కుని ఆమె భర్తకు గురువారం బ్యాంకులో అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు మేనేజరు బి. కిషోర్‌రెడ్డి, ఎస్ఎస్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు గణేష్, అప్పారావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం బాల్య వివాహ రహిత ముక్తి భారత్-100 డేస్ స్పెషల్ కాంపెయిన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్ఎం సిహెచ్.ఉమా ఆధ్వర్యంలో మహిళా పోలీస్ అధికారిణి సంధ్యారాణి విద్యార్థులకు బాల్యవివాహాల దుష్పరిణామాలు వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడి సూపర్వైజర్లు, ఉపాధ్యాయులతో సమావేశం జరుగగా, బాల్యవివాహాల నిర్మూలనలో సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

నివారణకు కృషి

సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ గంగిరెడ్లకాలనీ, పాత సబ్బవరం అంగన్వాడి సెంటర్లలో గురువారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ పిఓ వి.లలిత కుమారి రావలమ్మపాలెంలో స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో బాల్య వివాహల నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, తల్లులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-మునగపాక : డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలకు ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతూ మండల కేంద్రం మునగపాకలో గురువారం ఆశా వర్కర్లు విరాళాల సేకరణ చేపట్టారు. మహాసభల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. విరివిగా విరాళాలను అందజేసి మహాసభలను తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఈ పార్వతి, జయ పద్మ, వరలక్ష్మి, లక్ష్మి, గౌరీ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి జిల్లా రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు ఫీల్డ్‌లో మానిటరింగ్ చేసి, సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి అంశాలపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత గడువులో రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో తరచూ ఫీల్డ్ ఇన్స్పెక్షన్లు చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, పిజిఆర్ఎస్ పిటిషన్లు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వెరిఫికేషన్ చేసి నివేదికలు సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ ఆయిషా, రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఎడి సర్వే, సివిల్ సప్లై అధికారులు, జిల్లాలో గల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మన పల్లె -మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రజల సమస్యల పరిష్కారానికే మన పల్లె- మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. మండలంలోని అంతకాపల్లి, టెక్కలిపాలెం పంచాయితీల్లో గురువారం జరిగిన మన పల్లె- మన ఎమ్మెల్యే కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా రావులమ్మ పాలెం గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అంతకాపల్లి పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం గొట్టివాడ నుండి అంతకాపల్లి, రావులమ్మ పాలెం మీదుగా గుల్లేపల్లి రోడ్డునకు బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన గండి అనురాధకు 47,205 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి ఎంటర్ ప్రైజస్ అధినేత చొక్కాకుల వెంకటరావు, టిడిపి నేతలు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్, మాజీ జెడ్పిటిసి రొంగలి శ్రీరాములమ్మ దేముడుబాబు, సబ్బవరపు నరసింహమూర్తి, సబ్బవరపు రమణ, పల్లా రమణ, సబ్బవరపు సూర్యనారాయణ, జక్కాన సత్యనారాయణ, కిల్లి సూర్యనారాయణ, బోకం శ్రీనివాసరావు, మిడతాడ ఈశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు, బొండా సత్యారావు, కొటాన అప్పారావు, దొడ్డి సూర్యప్రకాష్, గవర అప్పారావు, రేసుపూడి రమణ, బయలపూడి దేముడు బాబు, బంతి కోళ్ల పద్మ, ఉగ్గినరాము, బోకం స్వామినాయుడు, గొర్లి కుమారస్వామి, టి.శేఖర్, కిల్లి వెంకట సత్యనారాయణ, పల్లి మంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

గల్లంతైన బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం వద్ద ఏలేరు కాలువలో బుధవారం గల్లంతైన అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన సబ్బి రిత్విక్ (7) మృతదేహం గురువారం లభ్యమైనట్లు సీఐ స్వామినాయుడు తెలిపారు. కసింకోట మండలం ఉగ్గిన పాలెం గ్రామంలో, బంధువులు ఇంటికి రిత్వక్ వచ్చాడు. బుధవారం ఉదయం రిత్విక్ మరొక బాలుడు ఏలేరు కాలువలో స్నానం చేస్తుండగా, రిత్విక్ ఏలేరుకాలువలో గల్లంతయ్యాడు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు కాలువ మునిగిన దగ్గరలోనే బాలుడి మృతదేహం తేలింది. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



డిఇఒతో సమస్యలను చర్చిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడును కలిసి ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జూన్ నెలలో బదిలీ అయ్యి, ఇంకా పాత పాఠశాలలోనే పనిచేస్తున్న 51 మంది హిందీ టీచర్లను రిలీవ్ చేయడానికి తగు ప్రపోజల్స్ రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపాలని కోరారు. ప్రభుత్వం నియమించే అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను రిలీవ్ కాకుండా ఉన్న హిందీ టీచర్ల స్థానంలో నియమించి సదరు హిందీ టీచర్లను ట్రాన్స్ఫర్ పొందిన కొత్త ప్రదేశాలకు పంపాలని డిమాండ్ చేశారు. పదవ తరగతి వందరోజుల ప్రణాళికలో భాగంగా సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పడం సరికాదని, ఆ తరగతులను నిలుపుదల చేసి, వాటిని పని దినాల్లో సర్దుబాటు చేయాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు సెలవులు తీసుకునే విషయంలో ఇబ్బందులు పడుతున్నారని, పలు హైస్కూల్లో రోల్ పెరిగినందున సరిపడని సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉందని వీటన్నింటినీ పరిష్కరించాలని కోరారు. డీఈవో స్పందిస్తూ సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, అనకాపల్లి మండల నాయకులు మామిడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ సంత బయలు వద్ద ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఘంటసాల శిలా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల కుటుంబంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఘంటసాల పాడిన పాటలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమైన కొనియాడారు. అనంతరం 25 మంది పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురుపు అప్పలనాయుడు, ఘంటసాల కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు పరవాడ జగదీశ్వరరావు, ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్, జడ్పిటిసి పిఎస్ రాజు, జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాదు, మాజీ జడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కన్నూరు వెంకటరమణ, బుగిడి రామ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జివిఎమ్‌సి బాలికల ఉన్నత పాఠశాలలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ చలనచిత్ర గాయకులు ఘంటసాల 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ఘంటసాల పాటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, ప్రముఖ వైద్యులు బిహెచ్.దక్షిణామూర్తి, పాఠశాల హెచ్ఎం రుధిరారాణి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు రంగులు వేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట మండలం, చరకం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనానికి అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వాలంటీర్లు గురువారం రంగులు వేశారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యా ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యు.నాగేశ్వరరావు, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి -అచ్చుతాపురం రహదారి విస్తరణ నిర్వాసితులకు న్యాయం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు కాండ్రేగుల వెంకటరమణ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. ఈ మేరకు విశాఖపట్నం విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌ను గురువారం వెంకటరమణ కలిసి రోడ్డు నిర్వాసితుల సమస్యలను వివరించారు.

ఆర్‌డిఒ హామీతో నిరవధిక నిరాహార దీక్ష విరమణ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని పెద్దపల్లి గ్రామంలో చెరువు భూమిని నిషేధిత జాబితాలో చేర్చి ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలన్న డిమాండ్ చేస్తూ తహశీల్దారు కార్యాలయం వద్ద మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామానికి చెందిన యువకులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను ఆర్‌డిఒ హామీతో గురువారం తెల్లవారుజాము 3.30 గంటలకు విరమించారు. అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, పరవాడ డిఎస్పి విష్ణు స్వరూప్, మున్సిపల్ చైర్పన్ రమాకుమారి, సిఐ ధనుంజయ రావు, వుటకూటి రమేష్‌లు గ్రామ పెద్దలు బొద్దపు ఎర్రయ్య దొర, దాసరి కుమార్, బొద్దపు శ్రీనివాసరావు(రమణ), బొద్దపు గణేష్‌లతో చర్చలు జరిపారు. 20 రోజుల్లో ఆ గ్రామంలో ఉన్న 22ఎ సెక్షన్లో ఉన్న 12.48 ఎకరాలు భూమి మొత్తం సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఆర్డీవో హామీ, పెద్దలు సూచనల మేరకు నిరవధిక నిరాహార దీక్షను బొద్దపు శివ, పడాల నాగేష్, బొద్దపు రాజు విరమించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి టౌన్ ఎస్ఐ సావిత్రి, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, నాయకులు, మూడు గ్రామల యువత పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వివక్ష సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయంలో పరిధిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వివక్షత చూపడం సరికాదని జీవిఎంసీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు కె.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కొన లక్ష్మణ, అధ్యక్షులుగా యర్రంశెట్టి అప్పలరాజు, ఉపాధ్యక్షులు మర్రం శెట్టి సుమన్, ప్రధాన కార్యదర్శిగా బంగారి రవికుమార్, కార్యదర్శిగా నిమ్మకాయల నర్సింహమూర్తి, కోశాధికారిగా పొట్నూరు శివ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంపల్లి అజయ్ కుమార్, కమిటీ సభ్యులుగా బంగారి శంకర్, సింగపల్లి విజయ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటియూసీ నాయకులు వి. నూకరాజు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి భూసార పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో గురువారం రైవాడ, దేవరాపల్లి గ్రామాల్లో భూసార సంరక్షణ పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణ, పరీక్ష, మట్టి కార్డుల పంపిణీ వంటి అంశాలను భూసార నిపుణురాలు మాధురి శరణ్య విపులంగా వివరించారు. రైతులు రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారిణి ఎల్‌వై.కాంతమ్మ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలోని మొత్తం 1100 మంది రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, వైసిపి నాయకుడు చల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కసింకోట : మండలంలో తాళ్లపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువుల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ ఏటిఎం పి.రామకృష్ణ, కూటమి నాయకులు ఉల్లింగల రమేష్, కర్రి వెంకట సత్యనారాయణ, గల్లా రాజు, చిన్ని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యంపై సమావేశం వాయిదా

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలోని ఫార్మా పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న కాలుష్య సమస్యలు, నిర్వాసితుల పునరావాస ఇబ్బందులు, మత్స్యకారుల జీవనోపాధి నష్టాలపై చర్చించేందుకు ఈ నెల 6న నిర్వహించాల్సిన సమీక్షా సమావేశం వాయిదా పడింది. ఫార్మా కంపెనీల ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఫార్మా సిటీలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అందుబాటులో లేకపోవడంతో మీటింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎంపీ అందుబాటులోకి వచ్చిన వెంటనే ఈ నెలలోనే మరో తేదీ ఖరారు చేసి, సమావేశం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జగనన్న కాలనీలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం జగనన్న కాలనీలో రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలను మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గొంతిన శివబాబు తన సొంత నిధులతో గురువారం తొలగించారు. సైడ్ కాలువలు కూడా తీయించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



వరి పంట కోస్తున్న రైతులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దిత్వా తుఫాను వలన వర్షాలు కురుస్తాయని ప్రచారం జరిగిన దృశ్య వరి పంట పండి ఎర్ర బారినప్పటికీ రైతులు ఇప్పటివరకు వాయిదా వేసుకొచ్చారు. ఇప్పుడు ఆకాశం మబ్బులు వీడి ఎండలు కాస్తున్నందున రైతులందరూ వరి చేను కోతపై దృష్టి సారించారు. పండిన వరి పంటను ఎక్కువ కాలం కొయ్యకుండా ఉన్నట్లయితే గింజల రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 10 శాతం వరి కోతలు జరిగాయి. స్వల్పకాల రకాలైన సాంబ మసూరి, సాధన, ఎర్రమల్లెలు, సోనా మసూరి తదితర రకాల పంటలను కోసి కుప్పలుగా పెట్టుకున్నారు. కొంతమంది రైతులు తుఫాన్ హెచ్చరికలను బేఖాతరు చేసి కోతలు కోయడంతో పంట వర్షానికి తడిసిపోయింది. మండలంలో సగానికి పైగా దీర్ఘకాలిక పంట అయిన ఆర్‌జిఎల్ సాగు చేశారు. ఈ పంట పొడవుగా ఉండడంతో పశువు లకు కావలసిన ఎండి గడ్డితో పాటు ధాన్యం కూడా దిగుబడి బాగా ఉండటంతో రైతులు ఆర్‌జిఎల్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ఆర్‌జిఎల్ కూడా కోత దశకు రావడంతో కోతలు కోస్తున్నారు. మండలంలో కొన్నిచోట్ల వరి కోత మిషన్ల ద్వారా కూడా కోతలు కోస్తున్నారు. ఎకరం పొలం కోయడానికి కూలీలకు సుమారు రూ.3,600 కాగా అదే మిషన్ ద్వారా అయితే రూ.2300 వరకు ఖర్చు అవుతోంది. ప్రస్తుతం కూలి రేట్లు పెరిగి అందరు ఒకేసారి కోతల మొదలుపెట్టడంతో రైతులు వరి కోత యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఈ ఏడాది మండలంలో 2800 హెక్టార్లు వరి సాగు చేశారు. గతంలో ఎప్పుడు 2600 హెక్టార్లకు మించి వరి సాగు చేసేవారు కాదు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ దివాళా తీయడంతో రైతులు క్రమంగా చెరకు సాగు తగ్గించి వరి పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది వరి పంటకు తెగుళ్ల అధికంగా రావడంతో రైతులు కొంతవరకు ఇబ్బంది పడ్డారు. క్రమేనా తెగిళ్ల ఉధృత తగ్గడంతో వరి పంట కోతకు సిద్ధమైంది.



భరత్‌కుమార్‌ను సత్కరించిన విభాగాల అధ్యక్ష కార్యదర్శులు

వైసిపి విభాగాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 84 వార్డు వైసిపి వివిధ విభాగాల నూతన అధ్యక్షులు, కార్యదర్శులను నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ నియమించారు. పార్టీ కార్యాలయంలో గురువారం 84 వార్డు పార్టీ అధ్యక్షుడు కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో పార్టీ విభాగాలు అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. 84వ వార్డు వైసిపి ప్రధాన కార్యదర్శిగా మాధురి నాయుడు, కార్యదర్శిగా వానపల్లి గంగాధర్, ఎస్సీ భాగం అధ్యక్షులుగా కోనేటి అప్పలరాజు, యువజన విభాగం అధ్యక్షులుగా నెట్టిన రామచంద్రరావు, బిసి సెల్ అధ్యక్షులుగా కొత్తపల్లి సత్తిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా గొర్లి లక్ష్మి, రైతు విభాగం అధ్యక్షులుగా ఇండిగా నాగు, సోషల్ మీడియా అధ్యక్షులుగా పూడి సుధీర్ కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా ఆవుపాటి మల్లేష్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందు, ఏఎంసి మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం- అనకాపల్లి రహదారి విస్తరణ పనులు కారణంగా విద్యుత్ పనులు చేయడానికి శుక్రవారం 11 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం, భోగాపురం, మోసయ్యపేట, రామన్నపాలెం, చౌడపల్లి తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసన్నట్లు పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

యలమంచిలి టౌన్ : యలమంచిలి సెక్షన్ 33/11కెవి నరసింగపల్లి సబ్ స్టేషన్, మెలిపాక ఫీడర్ పరిధిలో గల మెలిపాక గ్రామంలో లైన్ మెయింటనెన్స్ పనులు నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి శ్రీగురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి చిట్టిబాబు, డాక్టర్ ఆడారి అర్జున అప్పారావు సారధ్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాలు మండలంలోని రేగుపాలెం, లైన్ కొత్తూరు గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చిట్టిబాబు తెలిపారు. గురువారం రేగుపాలెంలో గ్రామ సచివాలయం, జడ్పీహెచ్ స్కూల్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్ధాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్మయిబాబా శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది : మండలం కొమల్లపూడి శివారు అమరపురిలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో విశ్వశాంతి జ్యోతిర్మయిబాబా శతజయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రోగులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారదమ్మ, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమకుమారి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీడీ నాగేశ్వరి దేవి, టిడిపి నాయకులు కోట నీలవేణి, ఎంవివి సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మ ఏర్పాటుపై వివాదం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పిపి అగ్రహారం గ్రామంలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కోసం సిమెంట్ దిమ్మ ఏర్పాటుపై వివాదం నెలకొంది. గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక లైను వేస్తున్నారు. దీనిలో భాగంగా రోడ్డు పక్కన స్తంభాన్ని పాతి సిమెంట్ దిమ్మను ఏర్పాటు చేయడానికి కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారు. పక్కనే భూమి ఉన్న యజమాని తన స్థలానికి సమీపంలో నిర్మాణం చేపట్ట వద్దని అభ్యంతరం తెలిపారు. దీంతో కాంట్రాక్టర్ నిర్మాణపు పనులను నిలిపివేసి వెళ్లిపోయారు. అనంతరం స్థానిక తెలుగుదేశం నాయకుడు నైదాన నానిబాబు, గ్రామస్తులు కలిసి అది ప్రభుత్వ స్థలమని, అక్కడే దిమ్మ నిర్మాణం చేసి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. గ్రామస్తులు దిమ్మనిర్మాణం చేయడం వివాదానికి దారి తీసింది. భూమి యజమాని అప్పారావు తన మనుషులతో వచ్చి సిమెంట్ దిమ్మను పడగొట్టాలని ప్రయత్నించడం, మరోవైపు అక్కడికి ఎవరైనా వస్తే అడ్డుకోవాలని గ్రామస్తులు గుమ్ముగూడడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సర్వేయర్ విఆర్వోలతో వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. సిమెంట్ దిమ్మను నిర్మించిన స్థలం ప్రభుత్వానికి చెందుతుందని నిర్ధారించారు. అయితే తన భూమి చుట్టూ వేసుకున్న కంచె తొలగించి సిమెంట్ స్తంభాలను నిర్మించినట్లు భూ యజమాని నైదాన అప్పారావు బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై టిడిపి నాయకులు నానిబాబు, గ్రామస్తులు గురువారం చోడవరం ఎమ్మెల్యే ఎస్ఎంఎస్ రాజును కలిశారు వినతిపత్రం అందజేశారు. దీంతో సదర స్థలానికి హద్దులను గుర్తించాలని తహసిల్దార్ లక్ష్మీకి ఎమ్మెల్యే సూచించారు.

6న జాతీయ స్థాయి పారా ఒలింపిక్స్‌కు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయస్థాయి పారా ఒలింపిక్ ఛాంపియన్ షిప్‌కు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ఎంపిక ఈనెల 6న స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో జరుగుతుందని సమగ్ర శిక్ష పథక అదనపు సమన్వయకర్త గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ ఎంపికలో 17 నుంచి 20 సంవత్సరాలు లోపు విద్యార్ధులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వారికి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పరుగు పందెం, షార్ట్ పుట్, లాంగ్ జంపు, హై జంప్, జావలిన్ త్రో, క్లబ్ త్రో విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో జరిగే పేరా ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు.

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టిపిసి సింహాద్రి ఆధ్వర్యంలో బోయినపాలెం సమీపంలోని వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు, సహాయక సామగ్రి అందించారు. వికలాంగుల సంక్షేమశాఖ, ఏపీ పౌరసరఫరాల శాఖలతో సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్, సిపి కుర్చీలు, హియరింగ్ ఎయిడ్స్, ఎఫ్‌ఆర్‌వో ఉత్పత్తులు, రోలేటర్లు, బ్రైల్ కిట్లు, ట్రై-ప్యాడ్స్, ఆర్థోపెడిక్ కిట్లు, మూకుడి పరికరాలు, విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అవసరమైన వారికి నైపుణ్యాభివృద్ధి సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఎన్టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ – సిడి విభాగం ఆధ్వర్యంలో వికలాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్టిపిసి సీనియర్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పరవాడ భవిత కేంద్రంలో వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు దివాకర్, సాయిశైలజ, హెచ్ఎం రామునాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు టి. కుమారి, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణం యర్రవరం గ్రామంలో డ్వాక్రా కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎం.సుధారాణి, కె.సత్య ఆధ్వర్యంలో శ్రీపరదేశమ్మ స్లం సమైక్య జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. వార్షిక నివేదిక, వార్షిక ప్రణాళిక, ఆర్థిక ప్రణాళిక గురించి డ్వాక్రా మహిళలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ సావిత్రి కొత్తగా ఏర్పడిన క్రిమినల్ చట్టాలు ట్రాఫిక్ నిబంధనలు గురించి తెలిపారు. పిల్లలు గంజాయి, మొబైల్స్ వంటి వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేలాగా ప్రతి తల్లితండ్రులు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిట్టా శ్రీనివాసరావు, గొర్లె సత్తిబాబు ఆర్పీలు టి ఉమా, సంధ్య సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి



నక్కపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి:సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్ పిలుపునిచ్చారు. నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద గురువారం మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఈనెల 31 వ తేదీ నుండి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జరగనున్నట్లు వెల్లడించారు. సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారి ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నంలో ఈ మహాసభలు చారిత్రాత్మకంగా జరుగుతున్నాయని, ఈ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్మిక సమస్యల పై నిత్యం అలుపెరుగని పోరాటాలు చేస్తున్నదని, కార్మిక సమస్యలపై కఠోర దీక్షతో పోరాడుతున్న కార్మికులకు అండదండగా సిఐటియు నిలుస్తుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక చట్టాలను రద్దుచేస్తూ లేబర్ కోడ్స్ ని తీసుకొచ్చి కార్మికుల్ని , శ్రమను నిలువు దోపిడీ చేసి కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఈ తరుణంలో మన ప్రాంతంలో జరుగుతున్న ఈ మహాసభలకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్నటువంటి విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే విధంగా బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్నటువంటి 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలు పెంచడానికి నిరసిస్తూ యావత్ కార్మిక వర్గం పోరాడుతుందని,వీటన్నింటిమీద ఈ మహాసభల్లో పెద్ద ఎత్తున చర్చ జరగబోతోందని, కాబట్టి కార్మిక వర్గం అంతా ఈ మహాసభలు జయప్రదానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసరపు నాగేశ్వరరావు, బర్నికాన రాము, గునుపల్లి సింహాద్రి, చొప్పా శ్రీను, దుర్గ, కొర్రా సంతోష్, రాజు ,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కునగరం:సిఐటియు జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఉక్కునగరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టీల్‌జోన్ అధ్యక్షులు వివి.రమణ మాట్లాడుతూ, ఆర్‌కె.బీచ్‌లో జనవరి 4వ తేదీన నిర్వహించే ర్యాలీ, బహిరంగసభలో కార్మిక వర్గం అంతా పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శ్రీను, అప్పారావు, నూకరాజు రెడ్డి, సత్యవతి, ఈశ్వరమ్మ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కి సిద్ధం



రోలుగుంటలో ఆహ్వానం పలుకుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈనెల 5 న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ లు కే.నరేష్, నాగన్నదొర లు చెప్పారు. మండలంలో ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు స్థానిక గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలలో ఈ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాలలను అన్ని విధాలా సిద్ధం చేయడం జరిగిందన్నారు. గురువారం పలు పాఠశాలలను సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాఠశాలలను మామిడి తోరణాలు, పూల అలంకరణతో ముస్తాబు చేస్తున్నారు. దాతలు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు ,ప్రజాప్రతినిధులను ముందు సాదరంగా ఆహ్వానించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోలుగుంట: మండలంలోని వెలంకాయలపాలెం గ్రామంలో ఈనెల5న జరిగే మెగా పేరెంట్ మీటింగ్ 3.0కి ఆహ్వాన పత్రాలను అందజేశారు. రాజపత్రం రూపంలో రాజు బంట్రోటులా రాజ సేవకులుగా వేషధారణలో విద్యార్థులు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.సూర్యనారాయణ, టీచర్ బి చంద్రశేఖర్ పాల్గొన్నారు

రావికమతం: మండలంలో ఈనెల 5న శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్‌కు మండల స్థాయి అధికారులు హాజరు కానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. ఆ సమావేశానికి హాజరైన విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలుతో కలసి భోజన కార్యక్రమం ఏర్పాటు చేయబడుతుందని ఎంఈవో బ్రహ్మాజీ తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి: రావికమతం: రావికమతం మండల నూతన డిప్యూటీ ఎంపీడీవో గా జి. శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం మండలంలో పనిచేసిన శ్రీనివాసరావు బదిలీపై రావిక మతం మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో గా పనిచేసిన ఎన్. సీతారామస్వామి నుంచి బాధ్యతలు స్వీకరించారు. మండలంలో 28 గ్రామపంచాయతీలోనూ నిర్దేశించిన పనులను పూర్తి చేసేందుకు, గ్రామాలలో పారిశుధ్యం, మంచి నీటి సౌకర్యం, వీధిలైట్లు, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు.



బాల్యవివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీగౌరి ఆధ్వర్యంలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చుటకు 100 రోజుల ప్రణాళికను రాష్ట్ర స్థాయి ప్రారంభించడం జరిగిందన్నారు. బాల్యవివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి చైల్డ్ మ్యారేజ్ ప్రొటక్షన్ ఆఫీసర్స్, విలేజ్ సెక్రటరీలు, మహిళా పోలీసులు కలిసి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలో ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో మండల యు.టి.ఎఫ్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు పంపనబోయిన వెంకటరావు ఎన్నికల అదికారిగా వ్యవహరించినారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్-పరీక్షకు మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 1 ఆర్ (ఐ.ఆర్.) ప్రకటించి పి.ఆర్.సి. కమీషన్ నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వము అధికారంలోనికి వస్తే పి.ఆర్.సి ను ఇస్తామని చెప్పిన విషయమే మర్చి పోయిందని వాపోయారు. అనంతరం నూతనంగా యూటీఎఫ్ మండల శాఖ కార్య వర్గం ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, కె.ఎస్.ఆర్.కే.రాజుత, అసోషియేట్ అధ్యక్షులుగా డి.జి.ఎన్.జె. ప్రసూనాంబ, కట్టా శ్రీను , ప్రధాన కార్యదర్శిగా కట్టా లోవరాజు, మండల కార్యదర్శులుగా జె.చినబాబు, ఎమ్.నాగరాజు, జి.వి. ప్రసాద్, ఎమ్. అపర్ణ, ఎమ్.వి. నాగేశ్వరావు, ఎమ్.టి.ఫణి కుమార్ , కె.వి.వి.రామారావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎ. శ్రీనివాసరావు, ప్రసాద్ జి.వి.గోపాలరావు మర్ల రామలక్ష్మి, జె.వి.ఎన్.పి. రాజేష్ , చంటియ్య , కోడి నానాజి, సిపిఎస్ కమిటి కన్వీనర్‌గా పి. ఫణింద్రకుమార్, అడిట్ కమిటి కన్వీనర్‌గా అప్పారావు, కె.గణపతి మహిళా విభాగ కార్యదర్శిగా ఎ.కొటేశ్వర్, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా కె. లక్ష్మణరావు, ప్రచార విభాగ కన్వీనర్ గా డి.ఐజాక్ లు ఎన్నికయ్యారు.



పాయకరావుపేటలో ఎన్నికైన నాయకులు

మాడుగుల:మండలంలోని ఎంకే. వల్లాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో నూతన యుటీఎస్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎం.కోటేశ్వరరావును, కార్యదర్శిగా జెసీయస్ కృష్ణతో పాటు గౌరవ అధ్యక్షులు బి.వి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు వై.నాగరాజును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిబద్ధతతో పని చేస్తామని తెలియజేశారు. పెండింగ్లో ఉన్న డీఏ బకాయిలు, పిఆర్సీ, ఐఆర్ను వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయులను భోధనకు మాత్రమే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు.



కోటేశ్వరరావు,అధ్యక్షులు



కృష్ణ, కార్యదర్శి

అక్రమ కట్టడాల నిలిపివేత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిపిఎం రాజు నిలపుదల చేశారు. ఈనెల 4న ప్రజాశక్తిలో అక్రమ కట్టడాలు తొలగించాలని వార్త ప్రచురితమయ్యింది. దీంతో, స్పందించిన ఆయన గ్రామంలో సందర్శించి మెయిన్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేశారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో ఉప్పరపల్లి, సైతార్‌పేట గ్రామంలో రైతులకు భూసార పరీక్ష పత్రాలు, ఉపయోగాలపై మండల వ్యవసాయ అధికారి సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ, రైతులు మట్టి నమూనాలను వారి పొలాల నుంచి సేకరించుకొని మట్టి సాయిల్ టెస్టింగ్ చేయించుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, వచ్చిన ప్రామాణికాలు బట్టి మనం ఎరువులు ఎంత వేయాలి అనే దాని పైన ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువుల తప్పనిసరిగా వాడుకొని భూమిని మరింత సారవంతం చేయాలని సూచించారు. అధికంగా రసాయనక ఎరుగులు వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.బీ.యం. శిరీష, . మండల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్దం, సర్పంచ్ శ్రీరాములు, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోషి, దినకర్, రేవతి, బ్లేస్సి , జాస్మిన్ , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న జగన్నాథరావు

విఆర్ఒ సంఘం అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి: రావికమతం:రావికమతం మండల వీఆర్వోల సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆసరి శ్రీనివాసరావును రావికమతం మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు కంచిపాటి జగన్నాథరావు సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ, అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి సమాజంలోనూ, ఉన్నత స్థాయి అధికారుల వద్ద ఎన్నడూ మంచి పేరు ప్రఖ్యాతలు లభిస్తాయన్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలోనూ రెవెన్యూ శాఖ పరంగా ప్రజలకు మంచి సేవలను అందించి ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అప్పారావు, పలువురు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సన్యాసిరావు

భవనాల పనులు పరిశీలన

ప్రజాశక్తి మాడుగుల:మండలంలోనిడిగ్రీ కళాశాల పురోగతికి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే బండారు సత్యనారాయనమూర్తి కృషి చేస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు అన్నారు. మండలంలో డిగ్రీ కళాశాల భవన నిర్మానాలు, అలాగే అన్నా క్యాంటీన్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గుత్తేదారులు నాణ్యతా లోపించకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శి పుప్పాల రమేష్, పాల్గొన్నారు.

మరింత చేరువగా పంచాయతీరాజ్ సేవలు

డిడిఒ కార్యాలయాల ప్రారంభంలో అధికారులు, ప్రజాప్రతినిధులు



సూర్యాబాగ్‌లో డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో తీసుకొచ్చిన నూతన సంస్కరణల ద్వారా వివిధ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని, కొత్తగా ఏర్పాటు చేసిన డిడిఒ (డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కార్యాలయాల ద్వారా పాలనా సౌలభ్యం కలుగుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రాష్ట్రంలో కొత్తగా 77 డిడిఒ కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. దీనిలో భాగంగా సూర్యాభాగ్‌లోని జోన్ - 4 జివిఎంసి కార్యాలయం తొలి అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన డిడిఒ కార్యాలయం నుంచి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న కాలంలో క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, డిడిఒ ఉషారాణి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయం ఆవరణలో నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పి.సుభద్ర, సిఇఒ పి.నారాయణమూర్తి, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, డిఎల్‌డిఒ సిహెచ్.నిర్మలాదేవి, ఎండిఒ కెవి.నరసింహారావు, డిప్యూటీ ఎండిఒ కె.రమేష్‌నాయుడు, ఎంఇఒ ఎం.శివరాణి, ఎన్‌ఆర్‌ఇజిఎస్, హౌసింగ్, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి నియోజకవర్గం కొత్తూరులో డివిజనల్ అభివృద్ధి అధికారి నూతన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, మాడుగుల, పెందుర్తి, యలమంచిలి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డిఎల్‌డిఒ మంజులవాణి, డ్వామా పీడీ పూర్ణిమ, డిఈఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ డీడీవో కార్యాలయం నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడారు. ప్రతి సచివాలయం, మండల స్థాయి అధికారులు సచివాలయం సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్లు, పాల్గొని వీక్షించారు.



బహుమతులు ఇస్తున్న ఎంఇఒ

ఉత్సాహంగా బహుముఖ పోటీలు

ప్రజాశక్తి-రావికమతం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం భవిత కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి 2 బ్రహ్మాజీ అధ్యక్షతన ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని 100 మంది దివ్యాంగ విద్యార్థులకు "పరుగు పందెం, జావలిన్ త్రో, షాట్ పుట్ ,మ్యూజికల్ చైర్ వంటి క్రీడా పోటీలను మేడివాడ వ్యాయామ ఉపాధ్యాయులు మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు రావికమతం మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంజి శ్రీనివాసరావు, టెలికం అడ్వైజరి బోర్డు సభ్యులు గల్లా రాజేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 6వ తేదీన అనకాపల్లి జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో పాల్గొంటారని ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, సరోజినీ తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు గంజి శ్రీనివాసు మాట్లాడుతూ, మండలంలో గల దివ్యాంగులు అందరూ ఒకచోట చేరుకొని పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండలం దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు (4-12-25 నుండి 10-12-25 వరకు) పాయకరావుపేట మండలం అరట్లకోట గ్రామములో ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రామకృష్ణారెడ్డి తెలిపారు. మొదటిరోజు ప్రత్యేక సేవా శిబిరాన్ని అరట్లకోట సర్పంచ్ పి.అప్పల నర్స మరియు కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ ఏ. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కి యువతీ యువకులు తమ వంతు కృషి చేయాలన్నారు. విద్యార్థులు విద్యనభ్యసించడంతో పాటు సామాజిక సేవాదృక్పథం కలిగి ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రామంలో పలు కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకమని చెప్పారు. యువత పెడదారికి ఎక్కువగా మక్కువ చూపుతున్నారని, వాటినుండి సమాజ హితానికి పాటుపడాలని, మంచి మార్గం అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కట్టా శ్రీను, తూము రమణ, వేముల వెంకటేశ్వర, తుమ్మల గణేష్, డి.రాజేష్ ఖన్నా, పంచాయితీ సెక్రటరీ రమేష్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళా ప్రారంభం



మేళాలో ఆకట్టుకున్న స్టాల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రకృతి ఆధారిత వ్యవసాయం ప్రాముఖ్యతను చాటిచెబుతూ తలపెట్టిన ఆర్గానిక్ మేళా గురువారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి ఆధారంగా పండిన పంటలను ఆహారంగా తీసుకోవాలన్నారు. నగరాన్ని మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దడం అందరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, రైతు సాధికారత సంస్థ ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబూరావు నాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, జివిఎంసి అడిషనల్ కమిషనర్ రమణమూర్తి, భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, ఎస్‌బిఐ, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్స్, గ్రీన్ క్లైమేట్ టీం, అగ్రి డిఎస్ఎ వెంచర్స్ వంటి ప్రముఖ సంస్థల నేతృత్వంలో ఈ మేళా చేపట్టారు. థింసా నృత్యం, కట్టె గానుగ, పుంగనూరు ఆవులు, కుమ్మరి సారె వంటివి ఆకట్టుకున్నాయి. బుద్ధుడు, అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



తనిఖీలు చేస్తున్న ఎడిఆర్‌ఎం

ఎడిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) కె.రామారావు ఆ రైలులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైలులో సరఫరా అవుతున్న బెడ్ షీట్ల నాణ్యత, కోచ్‌ల పరిశుభ్రత, ఆన్‌బోర్డ్ హౌస్ కీపింగ్ సిబ్బంది ప్రవర్తనపై ఆయన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులతో సిబ్బంది గౌరవంగా మెలగాలన్నారు.

షాపుల అద్దెలు చెల్లించాలి



గట్టిగా అడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల పంచాయతీ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు అద్దె చెల్లించాలంటూ పంచాయతీ సిబ్బంది ఆదేశించారు. అద్దె ఇప్పుడు తాము కట్టమని కట్టే సమయం ఉందని చెప్పడంతో పంచాయతీ సిబ్బంది ససేమిరా కట్టాలని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వీవాదం జరిగింది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే గురువారం ఉదయం పంచాయతీ సిబ్బంది మాడుగులలో పంచాయతీ షాపుల వద్దకు అద్దె వసూలు చేయడానికి వెళ్లారు. అద్దె కట్టమని అడగడంతో షాపుదారులు తాము కట్టడానికి ఇంకా సమయం ఉందని చెప్పడంతో పంచాయతీ సిబ్బంది ఇంకెప్పుడు కడతారు ఎన్నాళ్లు మీ చుట్టూ తిరగాలి అంటూ ప్రశ్నించడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పంచాయతీ నుండి అద్దె కట్టమని తమకు ఎటువంటి ముందస్తు నోటీసులు రాలేదని ఒక్కసారిగా వచ్చి అద్దే చెల్లించమని అంటే ఎలా అంటూ తెలిపారు. గతంలో కూడా ఇదే మాదిరిగా అధికారులు వ్యవహరించారని షాపుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపు షాపుకి మూత వేసి పంచాయతీ కార్యదర్శి వచ్చి సమాధానం చెప్పాలంటూ చెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న షాపులకు యజమానులుగా అసలు వ్యక్తులు కొంతమంది బినామీలుగా కొంతమంది ఉన్నప్పటికీ అద్దె వసూలు విషయమై ఉన్నవాళ్లకి ఒకరకంగా లేని వాళ్లకి ఒక రకంగా వ్యవహరిస్తూ పంచాయతీ అధికారుల ప్రవర్తిస్తున్నారని పలువురు విమర్శించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది

కనకమహాలక్ష్మి భక్తులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో నూతనంగా ఏర్పాటైన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు టౌన్ కొత్త రోడ్డు శాఖ ఆధ్వర్యంలో మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని రెండో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉదయం నుంచి మజ్జిగ, చిల్లర నాణేలు పంపిణీ చేశారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజరు కె.విశ్వనాథం, డిప్యూటీ మేనేజరు జె.శంకర్, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులతో పాటు చుట్టు పక్కల ఉండే వ్యాపారులు రూ.5, రూ.10, రూ.20 చిల్లర నాణేలు సుమారు రూ.35 వేలు వరకు తీసుకున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి-గొలుగొండ: అనకాపల్లి జిల్లా డిఐఒఓ ఎం.వినోద్ బాబు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి రాబోయే పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని, ప్రతీ ఒక్కరు బాగా చదవి మంచి ఉత్తీర్ణత శాతం తీసుకురావాలని, సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంకల్ప్ 2026లో భాగంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు కూడా ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీహరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌బాబు